క్లుప్తంగా

రాజకీయ జోక్యం లేకుండా ఎంపిక చేయాలి



గార్ల: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యం లేకుండా చూడాలని సీపీఎం మండల కార్యదర్శి అలువాల సత్యవతి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆమె మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న పేదలకు ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు ఉంటేనే ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు అర్హులని ప్రభుత్వం ప్రకటించడం సరైంది కాదన్నారు. ఈ సమావేశంలో నాయకులు అలువాల రామకృష్ణ, అబ్దుల్ గఫార్, వీరభద్రం, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలి

బయ్యారం: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర కోశాధికారి నందగిరి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడారు. తుఫాన్ ప్రభావంతో ఎప్పుడు వర్షం వస్తుందో తెలియక రైతులు భయపడాల్సి వస్తుందన్నారు. వర్షం వచ్చిన సమయంలో ధాన్యం తడవకుండా కప్పేందుకు రైతులకు పట్టాలు ఇవ్వాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలను ఏ రోజుకు ఆ రోజు మిల్లులకు సరఫరా చేయాలన్నారు.

దాతల సహకారంతో ఆలయ అభివృద్ధి

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శనిగపురం గ్రామంలోగల శ్రీకోదండ రామాలయాన్ని దాతల సహకారంతో అభివృద్ధి చేస్తున్నామని ఆలయ చైర్మన్ రాంశెట్టి వీరేందర్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. స్థానిక రామాలయంతోపాటుగా సుబ్రహ్మణ్య స్వామివారు, మానసాదేవి అమ్మవారు కొలువై ఉన్న దేవాలయానికి భక్తులు, దాతలు అందిస్తున్న ఆర్థిక చేయూత మరువలేనిదన్నారు. భగవంతుడి సేవలో జిల్లా రిటైర్డ్ జడ్జి జి.అనిల్ కిరణ్ కుమార్ దంపతులు తరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ వార్డు కౌన్సిలర్ బానోత్ హరిసింగ్, ఆలయ ప్రధాన కార్యదర్శి పద్మం ఉపేంద్రమ్మ, ఉపాధ్యక్షులు పద్మం చిన్న భిక్షపతి, కోశాధికారి చిట్టిమల్ల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షురాలిగా విజయ



పెద్దవంగర: మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పెద్దవంగర గ్రామ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పాలకుర్తి దేవస్థాన మాజీ చైర్మన్ వెనుకదాసుల రామచంద్రయ్య సమక్షంలో ఈ ఎన్నికను చేపట్టారు. అధ్యక్షురాలుగా నిమ్మల విజయ శ్రీనివాస్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా రాంపాక నారాయణ, ఉపాధ్యక్షుడిగా మందపురి సతీష్‌గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తన ఎన్నికకు సహకరించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

వాట్సాప్ లింక్‌లతో జాగ్రత్తగా ఉండాలి

నెల్లికుదురు: క్రిస్మస్ గ్రీటింగ్ మెసేజ్‌ల పేరిట వాట్సాప్‌లో సైబర్ నేరగాళ్లు పంపించే లింక్స్‌లతో జాగ్రత్తగా ఉండాలని ఎస్సై చిర్ర రమేశ్ బాబు ప్రజలను కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల వాట్సాప్ లింక్స్ తెరిస్తే వ్యక్తిగత డేటాను చోరీ చేస్తున్నట్లు తెలిపారు. తెలియని కొత్త నెంబర్లతో వచ్చే ఫోన్‌కాల్స్, ఎలాంటి మెసేజ్‌లు తెరిచి చిక్కుల్లో పడొద్దన్నారు. ఎవ్వరైనా సైబర్ నేరాల బారిన పడితే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని తెలిపారు.

అన్నిరకాల పంటలకు బోనస్ ఇవ్వాలి



కేసముద్రం: రైతు పండించిన అన్నిరకాల పంటలకు బోనస్ ఇవ్వాలని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి గుజ్జు దేవేందర్ డిమాండ్ చేశాడు. మండల కేంద్రంలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడ హామీలను నెరవేర్చాలన్నారు. పోడు పట్టాలకు ఎలాంటి కొర్రీలు పెట్టకుండా, రుణాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు బట్టు నాగేశ్వర్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు తాజ్‌పాషా, మండల కార్యదర్శి కొట్టం అంజయ్య పాల్గొన్నారు.

బంతి సాగు.. లాభాలు బాగు

- 300 ఎకరాల్లో బంతి సాగు
- తక్కువ పెట్టుబడి ఎక్కువ ఆదాయం
- 45 రోజులకే పంట దిగుబడి

పెద్దవంగర: పూలకు ఉన్న డిమాండ్ అంతా ఇంతా కాదు. ఏ శుభకార్యానికైన పూల అవసరం చాలా వరకు ఉంటుంది. గుడిలో దేవుడి వద్దగాని, పెళ్లి మండపాలకు, గృహాలతోపాటు సమావేశ మందిరాలు, తదితర వాటికి ఎక్కువగా వినియోగిస్తున్నారు. వినాయక చవితి నుంచి పూలకు డిమాండ్ మొదలు కాగా దుర్గాష్టమి, బతుకమ్మ, దీపావళి, లక్ష్మీపూజలో పూలు ప్రధానం. దీంతో పండుగలకు పూలకు మంచి డిమాండ్ పెరిగింది. ఆ తర్వాత శుభ ముహూర్తాలు, దైవ దీక్షలు పూల కొనుగోలు ఎక్కువగా ఉంటుంది. దీంతో జిల్లాలో కొంత మంది రైతులు బంతి పూల సాగుపై దృష్టి సారించారు. బంతి పంటతోపాటు చామంతి, కనకాంబరాలు, మల్లె, గులాబీ, లిల్లీతోపాటు మరికొన్ని పూల తోటలు సాగు చేస్తున్నారు. రైతులు డిమాండ్‌ను బట్టి తోటల వద్దే అమ్ముతున్నారు. ఇదిలా ఉండగా ఈ సీజన్‌లో బంతిపూల తోటలతో గ్రామీణా ప్రాంతాల్లో పచ్చదనంతో కళకళలాడుతూ.. కొత్త అందాలు తెచ్చిపెట్టాయి.

300 ఎకరాల్లో పూల సాగు..

జిల్లాలో 300 ఎకరాల్లో తొర్రూరు, నెల్లికుదురు, గార్ల, బయ్యారం, కేసముద్రం, సిరోలు, కురవి,



గంట్లకుంట గ్రామంలో పూలను కోస్తున్న కూలీలు

మరిపెడ, పెద్దవంగర మండలాల్లోని పలు గ్రామాల్లో బంతిపూల సాగులో ముందున్నారు. ఎకరా విస్తీర్ణంలో బంతి సాగుకు రూ.40నుంచి రూ.60వేల పెట్టుబడులు పెట్టినట్లు పూలసాగు రైతులు తెలిపారు. నాటు వేసిన 40 నుంచి 45 రోజులకే పూతకు వస్తోంది. సుమారు మూడు నెలల వరకు పంట దిగుబడి పొందవచ్చు. ఎక్కువగా బతుకమ్మ, దీపావళి పండుగకు దిగుబడులు అందేలా చర్యలు చేపడతామని చెబుతున్నారు. ఈ సీజన్‌లో వ్యాపారులు కిలోకు రూ.50 నుంచి రూ.60 విక్రయిస్తారు. విడిగా అయితే రూ.80నుంచి రూ.100కు పూలను విక్రయించి మంచి లాభాలు పొందుతున్నారు.

పట్టణాలకు ఎగుమతి..

జిల్లాలోని పలు మండలాల్లో పండించిన బంతి పూలను స్థానికంగా అమ్ముకుంటూనే హైదరాబాద్, వరంగల్, ఖమ్మం వంటి పట్టణాలకు ప్రతిరోజు ఎగుమతి చేస్తున్నారు. గత బతుకమ్మ, దీపావళి బంతి పూలు కిలోకు రూ.80 నుంచి 100 విక్రయాలు జరిగాయి. దీంతో పెట్టుబడులు పోను ఎకరాకు రూ.లక్ష వరకు ఆదాయం సమకూరినట్లు రైతులు పేర్కొంటున్నారు. ఈ సీజన్‌లో ఆశాజనకమైన పంటలు పండడంతో ధరలపై ప్రభావం చూపుతోంది. ప్రతి వేడుకకు పూల అవసరం ఉండడంతో ఆ దిశగా రైతులు ఆసక్తి చూపుతున్నారు.

రుణాలు మంజూరు చేస్తున్నాం..



నిబంధనల మేరకు ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో బంతి, చామంతి, తదితర పూల పంటలు సాగు చేస్తున్న రైతులకు చేయూతనిస్తున్నాం. ఎకరా పొలంలో బంతి సాగు చేసే చిన్న, సన్నకారు రైతులకు రూ.6,400 రుణాలు మంజూరు చేస్తున్నాం. పెద్ద రైతులకు రూ.4వేల చొప్పున రుణాలు అందజేస్తున్నాం. అర్హులైన రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– జినుగు మరియన్న, ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ జిల్లా అధికారి

విద్యా వ్యవస్థలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ విద్యావ్యవస్థకు ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఎంఈఓ శీలం వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో ఆదివారం నూతన, పాత ఎంఈఓలను ఐక్య ఉపాధ్యాయ సంఘాల నాయకులు సన్మానించారు. ఈసందర్భంగా ఎంఈఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, పదో తరగతికి ఉత్తమ ఫలితాలకు ఉపాధ్యాయుల సహకారం ఉండాలన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ఉపాధ్యాయులు విద్యార్థులను అన్నిరంగాల్లో తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈఓ బి.పూల్‌చంద్, పలు సంఘాల అధ్య



ఎంఈఓలను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

క్షులు చాగంటి ప్రభాకర్, సంకా బద్రినారాయణ, ఆవుల రవి, నాగముని, పార్శనంది రామయ్య, సోమ గోవర్ధన్, గీత, నాయకుల కొమిరే ఉప్పలయ్య, హరినాయక్, మేకల కుమార్, రాజశేఖర్ పాల్గొన్నారు.

భక్తిభావం పెంపొందించుకోవాలి

- ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు: ఆధ్యాత్మిక చింతన పెంపొందించుకొని భక్తిభావం కలిగి ఉండాలని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. ఆదివారం తొర్రూరు పట్టణ కేంద్రంలోని పాటిమీద ఆలయంలో నిర్వహించిన అయ్యప్పస్వాముల పడిపూజ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. మానసిక ప్రశాంతత కోసం ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని అలవర్చుకోవాలని పేర్కొన్నారు. అయ్యప్పస్వామి ఆశీస్సులతో ఎలాంటి అడ్డంకులు లేకుండా పాలకుర్తి నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలోని పాలకుర్తి, సన్నూరు, వల్మిడి దేవస్థానాలను అభివృద్ధి పరుస్తున్నట్లు తెలిపారు. ప్రతిపక్షాలు ఎన్ని అడ్డంకులు సృష్టించిన అభివృద్ధి ఆపబోమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రామచంద్రయ్య, నాయకులు సంతోష్, సోమరాజశేఖర్, విజయ్‌పాల్‌రెడ్డి, సోమన్న, అనిల్, కిషన్ యాదవ్, కృపాకర్‌రాజు, అర్చకులు, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

ఎమ్మెల్సీగా ఆహ్వానించకపోవడం సిగ్గుచేటు

- మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్
- స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తా..

కురవి: మండలంలోని అయ్యగారిపల్లి గ్రామంలో సమీకృత గురుకుల పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన చేసి ఎమ్మెల్సీగా తనను ఆహ్వానించలేదని, ఇది దురదృష్టకరమని, గిరిజన మహిళకు జరిగిన అవమానమని ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ విమర్శించారు. ఆదివారం మండలంలోని గుండ్రాతిమడుగు (విలేజి) శివారు పెద్దతండా గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తానని తెలిపారు. శాసనమండలి చైర్మన్‌కు, అసెంబ్లీ స్పీకర్ నోటీసుకు తీసుకెళ్తానని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. మాజీ ముఖ్యమంత్రి, ఇతర మంత్రులను పిలుస్తున్నామని చెబుతున్నారని, ఇక్కడ జరిగే కార్యక్రమానికి ఎమ్మెల్సీగా తనను పిలవకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. పాఠశాలకు శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ హడావుడిగా శంకుస్థాపన చేయడం సిగ్గుచేటన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్

రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలు

మహబూబాబాద్ రూరల్: రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలైన సంఘటన మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని గాంధీపురం గ్రామానికి చెందిన మున్సిపల్ వార్డు కౌన్సిలర్ చల్లాల ఉమ భర్త యాకయ్య తన ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తున్నాడు. ఆర్టి గార్డెన్ సమీపంలోకి చేరుకోగానే ఎదురుగా మరో ద్విచక్ర వాహనం యాకయ్య వాహనాన్ని ఢీకొట్టింది. ఆయనకు తీవ్ర గాయాలు కాగా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించి, పరిస్థితి విషమించడంతో ఎంజీఎంకు తరలించారు. మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు.

కేసముద్రంలో ఒకరికి..

కేసముద్రం: ప్రమాదవశాత్తు ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తికి గాయాలైన సంఘటన మండలంలోని బోడమంచ్యాతండా జీపీ శివారు గుడితండాసమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గూడూరు మండలం అప్పరాజ్‌పల్లి శివారు ఏఆర్‌తండాకు చెందిన మొగిలేష్ అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై కేసముద్రం మీదుగా మానుకోటకు వెళ్తున్నాడు. ఈక్రమంలో మానుకోట నుంచి కేసముద్రం వైపునకు ఆర్టీసీ బస్సు వస్తుండగా, గుడితండా సమీపంలోని మూలమలుపు వద్ద ప్రమాదవశాత్తు ఆర్టీసీ బస్సు, ద్విచక్రవాహనం ఢీకొన్నాయి. దీంతో మొగిలేష్‌కు గాయాలు కాగా, అతన్ని ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

శ్రమను దోచుకుంటున్న పెట్టుబడిదారులు



మాట్లాడుతున్న రామచందర్

నెహ్రూసెంటర్: ప్రపంచ వ్యాప్తంగా రాజకీయ, ఆర్థిక, సామాజిక సాంస్కృతిక పరిస్థితులను నిర్దిష్టంగా పరిశీలించడమే లెనినిజం సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కేజీ రామచందర్ అన్నారు. లెనిన్ శత వర్ధంతి సందర్భంగా పార్టీ ఆధ్వర్యంలో రాజకీయ శిక్షణ తరగతులను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెట్టుబడిదారి విధానంలో దేశప్రజల శ్రమశక్తిని దోచుకుంటున్నారని, దీనిపై శ్రామిక వర్గం నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి చిన్న చంద్రన్న, సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి, బండపల్లి వెంకటేశ్వర్లు, ముంజంపల్లి వీరన్న, పూనెం ప్రభాకర్, సమ్మయ్య, రాములు, యాకయ్య, కందాల రంగయ్య, పైండ్ల యాకయ్య, పాపారావు, రమేశ్ పాల్గొన్నారు.

‘గ్యారంటీ’లను అమలు చేయాలి

- సీపీఎం మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సోమయ్య

నెహ్రూసెంటర్: ప్రజాసమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సూర్నపు సోమయ్య అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని ఆదివారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్లు, డ్రెయినేజీ, భగీరథ వాటర్ పూర్తి స్థాయిలో అందించకపోవడం, నూతన పింఛన్లు, ఇంటి మీటర్ల సమస్యలు పేరుకుపోయి ఉన్నాయన్నారు. పేదలు నిర్మించుకున్న ఇండ్లకు ఇంటి నంబర్లు కేటాయించాలని డిమాండ్ చేశాడు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో అనేక సమస్యలు తిష్టవేసి ఉన్నాయని సమస్యలపై సీపీఎం బృందాలు సర్వేలు చేపట్టి వాటి పరిష్కారం కోసం దశలవారి ఉద్యమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాంనాయక్, అల్లి శ్రీనివాస్‌రెడ్డి, హేమానాయక్, నక్క సైదులు, మహేందర్, లాలయ్య, రషీద్, భాస్కర్ పాల్గొన్నారు.



సర్వే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సోమయ్య

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

నెల్లికుదురు: ఎన్నో సమస్యలతో సతమతమవుతున్న ప్రజల సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గుణగంటి రాజన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని వివిధ గ్రామాలల్లో సమస్యలపై సర్వే చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలల్లో మబ్బుల కారణంగా ధాన్యం 19శాతం తేమ ఉన్నా కాంటాలు పెట్టి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఇసంపెల్లి సైదులు, నాయకులు బాబు గౌడ్, అశోక్, సోమయ్య, సత్తయ్య, సుజాత పాల్గొన్నారు.



ధాన్యాన్ని పరిశీలిస్తున్న నాయకులు

ప్రైవేట్ ఉపాధ్యాయులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న మురళి

మహబూబాబాద్ అర్బన్: ప్రైవేట్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయుల యూనియన్ జిల్లా అధ్యక్షుడు గండు మురళి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో 8గంటల నుంచి 10గంటల వరకు కష్టపడి చాలీచాలని జీతాలకు పనిచేస్తున్నామన్నారు. ప్రైవేట్ పాఠశాలలో నేడు పదో తరగతితో ఉత్తమ ఫలితాలు 10జీపీఏలు సాధిస్తున్నారంటే దాని వేనుక ప్రైవేట్ పాఠశాలలో టీచర్ల కష్టం ఉందన్నారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం, ప్రభుత్వ తమ కష్టని గుర్తించి వారి కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో యూనియాన్ జిల్లా ఉపాధ్యక్షుడు బోయినపల్లి సుధాకర్, సెక్రటరి చేపూరి రవి, కోశాధికారి రాంబాబు, నాయకులు బట్టు అశోక్, రాంబాబు, సుమన్, అర్జున్, శంకర్, ఉప్పలయ్య, యాసిన్ పాల్గొన్నారు.

వైభవంగా రాములోరి కల్యాణోత్సవం

మహబూబాబాద్ రూరల్: త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామివారి మంగళాశాసనములతో శ్రీసీతాలక్ష్మణహనుమత్ సమేత శ్రీరామచంద్రస్వామి వారి చతుర్థ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా మహబూబాబాద్ మండలంలోని రెడ్యాల గ్రామంలో శనివారం రాత్రి రాములోరి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్ రెడ్డిబిందురెడ్డి, ఎన్నారై వెన్నం విజయకాంత్ రెడ్డి, గ్రామస్తుల ఆధ్వర్యంలో మహాసుదర్శన యాగం జరిపి, శ్రీసీతారామచంద్ర స్వామి వారి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్, డాక్టర్ ఉమ దంపతులు రాములోరిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో సామ రాజవర్ధన్, కుడుముల సురేందర్, నర్సింగ శ్రీనివాస్, వెంకట్రామన రసింహారెడ్డి పాల్గొన్నారు.



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

సంక్షిప్త సమాచారం

బియ్యం అందజేత

కేసముద్రం: కేసముద్రంవిలేజ్ శివారు ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన నరేష్ అనే వ్యక్తి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఈమేరకు కాంగ్రెస్ పార్టీ ఓబీసీ రాష్ట్ర వర్కింగ్ చైర్మన్ మేకల వీరన్నయాదవ్ సహకారంతో బాధిత కుటుంబానికి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు 50కేజీల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చిట్ల రవి, కత్తెరశాల శ్రీనివాస్, కిషన్, మాసాడి శ్రీనివాస్, బైరు వెంకన్న పాల్గొన్నారు.

‘మున్సిపాలిటీ అవసరం లేదు’

కేసముద్రం: పేద ప్రజలకు ఉపయోగంలేని మున్సిపాలిటీ కేసముద్రంకు అవసరంలేదని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ కేసముద్రం, తొర్రూరు సబ్‌డివిజన్ కార్యదర్శి శివారపు శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రాన్ని అభివృద్ధి చేయాలంటే మున్సిపాలిటీగా మార్చడమే ప్రధాన కారణం కాదని, దీంతో ఉపాధి హామీ పోతుందని, ఇంటి పన్ను, నల్లాపన్నుతోపాటు, వివిధ రకాల పన్నులు మనపై అదనంగా భారం పడుతుందని ఆయన పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

తొర్రూరు రూరల్: మండలంలోని గుర్తూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ దేవరకొండ శ్రీనివాస్ తల్లి ఇటీవల మృతిచెందగా ఆదివారం ఆమె చిత్రపటానికి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం అదే గ్రామానికి చెందిన పార్టీ అధ్యక్షుడు రంగయ్య కోడలు ఇటీవల మృతి చెందగా కుటుంబ సభ్యులను పరామర్శించారు. జీకే తండా గ్రామ పార్టీ అధ్యక్షుడు రమేశ్ తండ్రి మృతిచెందగా బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

దంతాలపల్లి: ఈనెల 14న తొర్రూరు పట్టణంలో నిర్వహించే లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై పిల్లల రాజు ఆదివారం తెలిపాడు. వివిధ కేసుల్లో కోర్టుల చుట్టు తిరుగుతున్న వారు లోక్ అదాలత్‌లో పాల్గొని సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు.

భక్తిశ్రద్ధలతో మహాపడిపూజ



కేసముద్రం: మండల కేంద్రంలోని సాయిగీతా రైస్‌మిల్లులో ఆగె వెంకన్న, ఆగె నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి మహాపడిపూజా కార్యక్రమం భక్తిశ్రద్ధల నడుమ ఆదివారం ఘనంగా జరిగింది. అయ్యప్ప నామస్మరణలతో ఈ పూజా కార్యక్రమం మార్మోగింది. స్థానికులు, చుట్టు పక్కల గ్రామాల నుంచి అయ్యప్పస్వాములు, భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు. ధర్మశాస్త దేవాలయ ప్రధాన తాంత్రికుడు విష్ణు నారాయణ పొట్టి ఇట్టి పూజా కార్యక్రమాన్ని వేద మంత్రోచ్ఛరణల మధ్య నిర్వహించారు.

వివాహ వేడుకకు హాజరైన మంత్రి సీతక్క

కేసముద్రం: మండల కేంద్రంలోని హరిహర గార్డెన్స్‌లో ఆదివారం జరిగిన ఓ వివాహ వేడుకకు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క హాజరై, దంపతులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, గుగులోతు దస్రూనాయక్, రావుల మురళీ, తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతే లక్ష్యంగా సదస్సులు నిర్వహించండి

నర్సింహులపేట : యాదవ కులస్తుల్లో ఐక్యత సాధించడమే లక్ష్యంగా అన్ని గ్రామాల్లో రాజకీయ అవగాహనా సదస్సులు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నీలారపు నరేందర్ కోరారు. పట్టణంలోని యాదవ సంఘం కార్యాలయంలో గొల్లకురుమ యూత్ రాష్ట్ర అధ్యక్షుడు ఆబోతు రాజు అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన నియోజకవర్గ యాదవ ముఖ్యనాయకుల సమావేశానికి నరేందర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నియోజకవర్గ స్థాయిలో యాదవులు ఐక్యత చాటాలని ఆకాంక్షించారు. నియోజకవర్గ స్థాయిలో కమిటీ వేసి ఒకే నినాదంతో ముందుకు సాగాలని సూచించారు. బుధరావుపేట మాజీ సర్పంచ్ కాస ప్రవీణ్ మాట్లాడుతూ యాదవులు విద్య, ఉద్యోగ, ఉపాధి, ఇతర అన్ని రంగాల్లో రాణించేలా చైతన్యవంతం కావాలని కోరారు. ఖానాపురం సొసైటీ డైరెక్టర్లు ఆబోతు అశోక్, మేకల కుమార్ మాట్లాడుతూ ఐక్యతతోనే ఏదైనా సాధించగలమని చెప్పారు. యాదవ కులస్తులందరినీ ఏకతాటిపైకి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో నాయకులు బూస రాజు, ఉడుగుల రాజు, ఆబోతు రాజ్‌కుమార్, జెల్ల నరేశ్, పులిగిల్ల సుధాకర్, గాడుదుల జగ్గయ్య, పృథ్వీరాజ్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ..



మరిపెడ రూరల్: మరిపెడ మండలం చిల్లంచర్ల గ్రామానికి చెందిన దుస్స కృష్ణ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ మృతుడి చిత్రపటం వద్ద నివాళులర్పించాడు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశాడు. రెడ్యానాయక్ వెంట మరిపెడ మాజీ వైస్ చైర్మన్ గాదె అశోక్‌రెడ్డి, డీఎస్ రాంసింగ్, పిట్టల ధనుంజయ, బుచ్చయ్య ఉన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి



క్రీడలను ప్రారంభిస్తున్న ఎస్సై

తొర్రూరూ రూరల్: క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని తొర్రూరు ఎస్సై ఉపేందర్ అన్నారు. క్రిస్మస్ వేడుకల సందర్భంగా మండలంలోని అరిపిరాల గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలను ఆదివారం ఎస్సై ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీన ప్రాంతాలలో రాష్ట్ర స్థాయి క్రికెట్ క్రీడోత్సవాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఈనెల 25న క్రీడలు ముగిస్తాయన్నారు. ప్రథమ బహుమతి రూ.30,016 ద్వితీయ బహుమతి రూ.20, 016, తృతీయ 10,016 ఎమ్మెల్యే మామిడాల యశ్వశిని చేతులపై అందించనున్నట్లు తెలిపారు. నాయకులు కిషన్ రెడ్డి, వెంకన్న, పరశురాములు పాల్గొన్నారు.

నిరుపయోగంగా ‘ఉపాధి’ బోర్డులు



గార్ల: జాతీయ ఉపాధి హామీ పథకం పని ప్రదేశాల్లో పెట్టాల్సిన బోర్డులు, అక్కడ పెట్టకుండా స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ప్రాంగణంలో నిరుపయోగంగా పడి ఉన్నాయి. 2021, 2022, 2023 సంవత్సరాల్లో ఉపాధి పనులకు సంబంధించిన బోర్డులు ఎంపీడీఓ కార్యాలయం ప్రాంగణంలో దర్శనమిస్తున్నాయి. ఇట్టి విషయంపై ఈజీఎస్ ఏపీఓ సజన్‌స్వరూప్‌ను ‘సాక్షి’ వివరణ కోరగా పని ప్రదేశాల నేమ్ బోర్డుల బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ పని ప్రదేశాల్లో పెట్టకుండా కార్యాలయం ప్రాంగణంలోనే ఉంచినట్లు తెలిపారు.